

చెరకు టన్నుకు బోనస్ రూ.218

- పంటల బీమా కోసం రూ.1,775 కోట్లు కేటాయింపు
- చెంగల్పట్టులో 'మందార' ఉత్పత్తి కేంద్రం
- రూ.16,500 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం
- వ్యవసాయ బడ్జెట్ దాఖలు చేసిన మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం
- రైతు సంక్షేమమే లక్ష్యమని ప్రకటన



సీఎం ఆశీస్సులు పొందుతున్న మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. చెరకు రైతులను ఆదుకునేందుకు టన్నుకు రూ.218 ప్రోత్సాహక నగదును ప్రకటించారు. అలాగే, కొత్తగా 'మట్టి పంటలను కాపాడుదాం' పేరుతో నూతన పథకాన్ని ప్రకటించారు. దీంతో పాటు ఈ బడ్జెట్‌లో పంట రుణాల కోసం రూ.1,600 కోట్లు కేటాయించారు. పంటల బీమా కోసం రూ.1,775 కోట్లు, 26,179 మంది రైతులకు రూ.170 కోట్లతో పనిముట్ల కొనుగోలు రుణాన్ని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం, వడ్డీ రాయితీగా రూ.700 కోట్ల కేటాయింపు వంటి అంశాలు ఈ బడ్జెట్‌లో హైలెట్‌గా నిలిచాయి. మంగళవారం ఉదయం సీఎం స్టాలిన్ కార్యాలయానికి వెళ్లిన మంత్రి .. ఆయన ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం సీఎంతో కలిసి అసెంబ్లీకి వెళ్లారు. అక్కడ ఉదయం 10 గంటలకు 2024-25 సంవత్సర వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. తెన్‌కాశి జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట దిగుబడి తగ్గిపోయిన రైతులతో పాటు గత యేడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన దక్షిణాది జిల్లాలకు చెందిన రైతులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసే విధంగా 2.74 లక్షల మంది రైతులకు రూ.208.20 కోట్ల పరిహారాన్ని త్వరలోనే పంపిణీ చేస్తామని ప్రకటించారు. గత యేడాది తమిళనాడు పౌరసరఫరాల మంత్రిత్వ శాఖ ద్వారా 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు వివరించారు. సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.107, సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.82 చొప్పున బోనస్ ఇచ్చినట్టు తెలిపారు. అదేవిధంగా గత యేడాది చెరకు టన్నుకు బోనస్‌గా రూ.195 చొప్పున మొత్తం రూ.260 కోట్ల బోనస్‌ను పంపిణీ చేశామని, ఇపుడు ఈ బోనస్‌ను రూ.218కు పెంచుతున్నట్టు మంత్రి వివరించారు.

బీడు భూముల పథకానికి రూ.200 కోట్లు

రాష్ట్రంలోని బీడు భూములను బంజరు భూములుగా మార్చి రైతులకు అప్పగించేందుకు ప్రభుత్వం రూ.200 కోట్లను కేటాయించింది. ఇందుకోసం 'కలైంజర్ ఆల్ విలేజెస్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ స్కీం' పేరుతో పథకం అమలవుతోంది. ఈ పథకం కింద గత 2021-22 సంవత్సరం నుంచి ఐదేళ్లకాలానికి 12,525 పంచాయతీల్లో అన్నా మరుమలర్చి పథకం కింద అమలు చేయనున్నట్టు తెలిపారు. 2024-25లో ఈ పథకం కింద ఎంపిక చేసిన 2482 గ్రామ పంచాయతీల్లో బీడు భూములను బంజరు భూములుగా మార్చేందుకు రూ.200 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు.

ముగ్గురికి నమ్మాళ్వార్ అవార్డు

వ్యవసాయ రంగంలో ఉన్నతంగా రాణించే ముగ్గురు రైతులను ఎంపిక చేసి వారికి నమ్మాళ్వార్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. 2024-25 సంవత్సరంలో కూడా ఈ అవార్డులను పంపిణీ చేస్తామని ఇందుకోసం బడ్జెట్‌లో రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్టు తెలిపారు.

116.96 లక్షల ఆహార ధాన్యాల ఉత్పత్తి

గత మూడేళ్లుగా అనేక అద్భుతమైన వ్యవసాయ పథకాలను విజయవంతంగా అమలు చేస్తుండడంతో 2020-21లో 152 లక్షల ఎకరాలుగా ఉన్న సాగుబడి విస్తీర్ణం.. 2022-23లో 155 లక్షల ఎకరాలకు పెరిగిందన్నారు. ఫలితంగా 2022-23లో 116.91 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేశారని తెలిపారు.

కొత్తగా 100 రకాల రోజాలు... :ఊటీ బొటానికల్ గార్డెన్‌లో 2024-25 సంవత్సరంలో కొత్తగా 100 రోజా రకాలను పరిచయం చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. ప్రస్తుతం ఈ గార్డెన్‌లో 4,201 రోజా జాతులతో 32 వేల మొక్కలు ఉన్నాయి. ఊటీ పార్కును మరింత సుందరీకరించేందుకే రోజా రకాలను ప్రవేశపెట్టనున్నట్టు పేర్కొన్నారు.

చెంగల్పట్టులో ... : మందార పూలను ఆహారం, సౌందర్యం, మందుల తయారీలో ఉపయోగిస్తున్నారు. ఈ మందార ఆకుల నుంచి తయారు చేసే తేనీరు రక్తపోటు, మానసిక ఒత్తిడి, కొవ్వు, శరీర బరువును తగ్గించేందుకు దోహదపడుతుంది. ఇలా అనేక రకాలుగా ఉపయోగపడే మందార ఆకులు, పువ్వులను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చెంగల్పట్టు జిల్లా ఆత్తూరులో రూ.కోటితో మందార పువ్వుల ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పుతామని మంత్రి వెల్లడించారు.

హార్టికల్చర్ పంటల సాగుకు

కొడైకెనాల్‌లో కొండ వెల్లుల్లి, రామనాథపురంలో మిర్చి, సాత్తూరు సాంబా మిర్చి, కొల్లిమలై మిరియాలు, కన్నియాకుమారి లవంగం, తేని యాలకులు, కోయంబత్తూరు జాజికాయ వంటివాటి సాగుకు రూ.2.70 కోట్లను కేటాయించినట్టు తెలిపారు. రైతులు, ప్రజల వినతి మేరకు జీఐ ట్యాగ్ కలిగిన ముండు మిర్చిని మరింతగా సాగు చేసేందుకు రాయితీని ఇవ్వనున్నట్టు తెలిపారు.

మొక్కజొన్న కోసం

సేలం, కరూర్, తూత్తుక్కుడి జిల్లాలో మొక్కజొన్న అధికంగా సాగవుతోందని దీన్ని మరింతగా ప్రోత్సహించేందుకు 2024-25లో స్మాల్, మీడియం, హైటెక్ పద్ధతుల కోసం రూ.13 కోట్లను కేటాయించినట్టు మంత్రి తెలిపారు.

ఉచిత విద్యుత్ పథకం కోసం...

రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడిని మరింతగా పెంచేలా రైతులను ప్రోత్సహించేలా రాష్ట్రంలో ఉచిత విద్యుత్ పంపిణీ పథకం అమలవుతుంది. ఈ పథకం కింద ఇప్పటికే 21.51 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. ఈ పథకం అమలు కోసం రూ.7,282 కోట్లను కేటాయిస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

రూ.16,500 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం

సహకార సంఘాల్లో రుణాల పంపిణీ కోసం రూ.16,500 కోట్లను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు మంత్రి తెలిపారు. ఇందుకోసం వడ్డీ రాయితీగా రూ.700 కోట్లను కేటాయించినట్టు పేర్కొన్నారు. కోళ్లు, మేకలు, గొర్రెలు, పశువులను కొనుగోలు పెట్టుబడి రుణం రాయితీ కోసం రూ.200 కోట్లను కేటాయించారు. డెల్టా జిల్లాల్లో సీ, డీ కేటగిరీలకు చెందిన సాగునీటి పూడికతీత పనుల కోసం రూ.10 కోట్లను కేటాయించారు. నీటి నిల్వ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ కోసం రూ.275 కోట్లను కేటాయిచారు. కొత్తగా వ్యవసాయ సామాగ్రిని కొనుగోలుకు రూ.28.82 కోట్లను కేటాయించారు.

ఉత్తమ రైతులకు రూ.2.50 లక్షలు

రాష్ట్ర స్థాయిలో చిరు ధాన్యాలు, పంట రకాలు, నూనెగింజెలు, చెరకు పంటలో అధిక దిగుబడి సాధించే ముగ్గురు రైతులను ఎంపిక చేసి మొదటి బహుమతిగా రూ.2.50 లక్షలు, రెండో బహుమతిగా రూ.1.50 లక్షలు, మూడో బహుమతిగా రూ.లక్ష అందిస్తామని తెలిపారు. ఈ పథకం కోసం రూ.55 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. పట్టభద్రులైన యువతకు వ్యవసాయంపై మక్కువ పెంచేందుకు 2024-25లో ఏదో ఒక వ్యవసాయ వృత్తిని చేసుకునేందుకు వీలుగా 100 మంది యువకులకు రూ.లక్ష చొప్పున రాయితీ ఇచ్చేందుకు కోటి రూపాయల నిధిని కేటాయించామన్నారు.



అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్ దాఖలు చేస్తున్న మంత్రి పన్నీర్‌సెల్వం

50 వేల ఎకరాల్లో కందిపప్పు సాగు

అన్ని కాలాల్లో పంటల సాగు చేసే విధంగా 2024-25 సంవత్సరంలో పంటల దిగుబడి పథకం కింద 4.75 లక్షల ఎకరాల్లో రూ.401.27 కోట్ల కేంద్ర, రాష్ట్ర నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు. అయితే, రాష్ట్రంలో అధికస్థాయిలో దిగుబడి చేసే కంది పప్పు... క్రమేణా తగ్గి కేవలం 1.25 లక్షల ఎకరాల్లో సాగవుతోందన్నారు. కంది సాగును మరో 50 వేల ఎకరాల విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకునేందుకు రూ.17.50 కోట్ల నిధులను కేటాయించారు.

తెలుగు సబ్జెక్టు తీసుకోవచ్చు సరే!

- మరి దాని అభ్యాసానికి సమయమేదీ?
- ఒకే పీరియడ్‌లో రెండు సబ్జెక్టులు చదవడం సాధ్యమేనా?
- లాజిక్ మరచిన సర్కారు!
- నేడు మాతృభాషా దినోత్సవం

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' వస్తోందంటే అన్ని ప్రాంతాల్లోని భాషల వారు తమ మాతృభాష అభివృద్ధి గురించి, అందులో తమ పాత్ర గురించి వేనోళ్ల చెప్పుకుంటూ పులకించిపోవడం కద్దు. అయితే తమిళనాడులో మాత్రం.. 'మన భాష' కొన్నాళ్లయినా బతుకుతుందోలేదో, మన బిడ్డలకు మన మాతృభాషను వారసత్వంగా ఇస్తామోలేదో అంటూ తెలుగువారు వాపోవాల్సిన పరిస్థితి. రోజురోజుకు కుంచించుకుపోతున్న తెలుగు భాషా పరిధిని చూసి కుమిలిపోవాల్సిన దుస్థితి. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇటీవల మైనార్టీ భాషా విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులే ఇందుకు ఉదాహరణ. ఈ ఉత్తర్వులు మైనారిటీ భాషా విద్యార్థులకు వెసులుబాటుగా కనిపించినా, క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇందులోని డొల్లతనం తేటతెల్లమవుతుంది.



2006లో వచ్చిన 'నిర్బంధ తమిళం' జీవో పుణ్యమాని.. రాష్ట్రంలోని తెలుగు, కన్నడ, మలయాళ, ఉర్దూ, మరాఠీ తదితర మైనార్టీ భాషా విద్యార్థులు తమ మాతృభాషను పాఠ్యాంశంగా తీసుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. ఈ వ్యవహారం పట్ల కొన్ని సంస్థలు ఆందోళన వ్యక్తం చేయగా, మరికొన్ని న్యాయస్థానాలను ఆశ్రయించి ఫలితాన్ని రాబట్టాయి. మైనార్టీ భాషా విద్యార్థుల మాతృభాష సబ్జెక్టుకు కూడా మార్కులు నిర్ణయించి, దాన్ని జాబితాలో పొందుపరచాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తమిళనాడు ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఇంతవరకూ బాగానే వుంది. ఈ తీర్పు రాష్ట్రంలోని మైనార్టీ భాషల వారికి ఊరట కల్పించేదే. ఈ తీర్పు ఆధారంగా రాష్ట్రప్రభుత్వం ఈనెల 13న ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మైనార్టీ భాషల వారు తమ మాతృభాషను కూడా సబ్జెక్టుగా తీసుకోవచ్చని, ఆ ఐచ్ఛిక సబ్జెక్టు పాసయ్యేందుకు 35 మార్కులను విధిగా నిర్ణయించింది. ఆ మార్కులను మార్క్స్‌లిస్ట్‌లో పొందుపరుస్తామని కూడా స్పష్టం చేసింది. అయితే ఆ సబ్జెక్టుకోసమంటూ ప్రత్యేకంగా పీరియడ్ కేటాయింపు సంగతిపై మాత్రం స్పష్టత లేకుండా పోయింది.

అసలు సమస్య...

ఇక్కడే అసలు సమస్య ప్రారంభమవుతుంది. టెన్త్ విద్యార్థికి ఐదు సబ్జెక్టులుంటాయి. ఒక్కో సబ్జెక్టులో 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. అయితే మైనార్టీ భాషా విద్యార్థులు తమ మాతృభాషను సబ్జెక్టుగా తీసుకోవాలనుకుంటే.. 6వ సబ్జెక్టుగా తీసుకోవాలన్నమాట. అంటే తమిళంను లాంగ్వేజ్‌గా తీసుకునే విద్యార్థులు ఐదు పాఠ్యాంశాలు చదివితే.. మైనారిటీ భాషను కూడా సబ్జెక్టుగా తీసుకునే విద్యార్థి 6 సబ్జెక్టులు చదవాలన్నమాట. ఇదే జరిగితే ఆరు సబ్జెక్టులు చదివే విద్యార్థులు ఐదు సబ్జెక్టులు చదివే వారితో పోటీ పడడం సాధ్యమేనా? ఇలాంటప్పుడు మార్కులు తగ్గి, భవిష్యత్తులో సదరు విద్యార్థులు వెనుకబాటుకు గురయ్యే ప్రమాదం వుంది కదా?!

రెండు పాఠ్యాంశాలు... ఒక్క పీరియడ్

రాష్ట్ర విద్యాశాఖ ఒక్కో సబ్జెక్టుకు వారానికి ఆరు పీరియడ్లు కేటాయించింది. అంటే తమిళం చదువుకునే వారికి వారానికి ఆరు పీరియడ్లు వుంటాయి. మైనార్టీ భాషల వారు తమ మాతృభాషను చదుకోవాలనుకుంటే ఇదే ఆరు పీరియడ్లలోనే తమిళంతో పాటు వారి మాతృభాష సబ్జెక్టును కూడా చదుకోవాలన్న మాట. ఒక్కో పీరియడ్ కాలపరిధి 45 నిమిషాలు, అంటే వారానికి ఆరు పీరియడ్లలో, అంటే నాలుగున్నర గంటల్లో రెండు భాషల ప్రావీణ్యం సాధించడం సాధ్యమేనా? దీనివల్ల ఉభయ భాషా భ్రష్టత్వం పొందే అవకాశముందేమో కదా?! దీనివల్ల సాంకేతికంగా పలు సమస్యలు ఎదురయ్యే అవకాశముందని తెలుగు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కూడా మరోమారు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే తప్పకుండా వెసులుబాటు లభించే అవకాశముందని వారు సూచిస్తున్నారు.

లాభముంటుందా?

సహజంగానే తెలుగువారికి మాతృభాష పట్ల మమకారం అత్యల్పమన్న నానుడి వుంది. దీనికి తోడు తెలుగు మీడియాన్ని తీసేసి, అదీ ప్రజల అభివృద్ధి కోసమేనని నమ్మబలికే తెంపరి ప్రభుత్వాలు నడుస్తున్న కాలమిది. ఇలాంటి పరిస్థితుల్లో ఒక సబ్జెక్టును అదనంగా తీసుకుని చదవాలని చెప్పే తెలుగు తల్లిదండ్రులెంతమంది?.. వారి సూచనలను పాటించి తమ తల్లిభాషను కూడా అదనంగా చదువుకునేందుకు సాహసించే బుడతలెంతమంది?.. మాతృభాషలోని తియ్యదనం ఆ బిడ్డలకి అర్థమయ్యేదెలా?.. వారికి అర్థమయ్యేలా నచ్చచెప్పేదెలా?.. ఇంతకీ మైనార్టీ భాషా విద్యార్థులకు వెసులుబాటు కల్పిస్తున్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన తాజా ఉత్తర్వుల వల్ల మనకేమైనా లాభముందంటారా?..

రైతులకు నిరాశే

వ్యవసాయ బడ్జెట్‌పై ఈపీఎస్ ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న ఈపీఎస్ బృందం

అడయార్, ఫిబ్రవరి 20: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం 2024-25 సంవత్సరానికిగాను శాసనసభలో రైతు బడ్జెట్‌ను వ్యవసాయ శాఖమంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌పై ప్రధాన విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి స్పందించారు. అసెంబ్లీ వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌తో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. మాటల గారడీతో ప్రజలను మభ్యపెట్టేలా ఉందని, ప్రజల దిశ మార్చి వారిని మోసగించేలా ఉందన్నారు. దీర్ఘకాల అభివృద్ధి పథకాలు ఒక్కటంటే ఒక్కటి లేవని, రాష్ట్ర ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసే చర్యలు ఒక్కటి కూడా లేవని ధ్వజమెత్తారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వం అధికమొత్తంలో రుణాలు తీసుకుని, ఖర్చులను పెంచిందని ఆరోపించిన డీఎంకే నేతలు.. తాము అధికారంలోకి వస్తే ఆర్థిక రంగాన్ని గాడిలో పెడతామని ప్రకటించారని, కానీ, డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడీతో రూపొందించారన్నారు. డీఎంకే ప్రభుత్వ ఐదేళ్లలో పూర్తయ్యే సమయానికి రాష్ట్ర అప్పులు రూ.5 లక్షల కోట్లకు చేరుకుంటాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. అదేవిధంగా తాజాగా ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్ కూడా రైతులకు ఏమాత్రం మేలు చేసేలా లేదని ఎడప్పాడి పేర్కొన్నారు.

కొత్త అంశాలు ఎక్కడ? వానతి శ్రీనివాసన్

వ్యవసాయ బడ్జెట్‌లో కొత్త అంశాలు లేవని బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ అన్నారు. ముఖ్యంగా వ్యవసాయ సమస్యలకు ఎక్కడా పరిష్కార మార్గం చూపలేదని, చేతికొచ్చిన చెరకు పంటకు నిధులు పొందలేని దుస్థితిలో చెరకు రైతులు ఉన్నారన్నారు. ఈ బడ్జెట్‌లో కొత్త పథకాలు ఏవీ లేవని, వ్యవసాయ బడ్జెట్‌లో 60 శాతం పథకాలు కేంద్ర ప్రభుత్వ నిధుల భాగస్వామ్యానివేనన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా నిరాశకు లోను చేసిందని, ముఖ్యంగా కొబ్బరి రైతుల గురించి ప్రస్తావనే లేదని పేర్కొన్నారు.

రాజ్యసభ సభ్యుడిగా మురుగన్ ఏకగ్రీవం



పెరంబూర్, ఫిబ్రవరి 20: బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి రెండో సారి రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను గుజరాత్ రాష్ట్రం, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్‌ను మధ్యప్రదేశ్‌నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎంపిక చేయాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, నామినేషన్ ప్రక్రియ గడువు ముగిసిన నేపథ్యంలో, ఇతరులెవ్వరూ నామినేషన్ వేయకపోవడంతో గుజరాత్ నుంచి జేపీ నడ్డా, మధ్యప్రదేశ్ నుంచి మురుగన్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అలాగే, రాజస్థాన్ నుంచి ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ సహా పలు రాష్ట్రాల నుంచి బీజేపీ నేతలు అధికంగా రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

పుదుచ్చేరి సీఎస్‌గా శరత్ చౌహాన్

- తిరుపతి లడ్డూతో స్వాగతం



ముఖ్యమంత్రి రంగస్వామిని కలుసుకున్న సీఎస్ శరత్ చౌహాన్

పుదుచ్చేరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా శరత్ చౌహాన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వంతో కలసి పనిచేస్తానని ముఖ్యమంత్రి, అసెంబ్లీ స్పీకర్‌ను కలుసుకున్న అనంతరం సీఎస్ తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన రాజీవ్‌వర్మ తమకు సహకరించడం లేదని అధికారపార్టీ ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కూడా పలువురు ఎమ్మెల్యేలు సీఎస్ తీరుపై మండిపడ్డారు. ఈ క్రమంలో, ప్రభుత్వానికి సహకరించని అధికారులపై చర్యలు చేపడతామని ఈ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ సెల్వం తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రంగస్వామి స్వయంగా సీఎస్ రాజీవ్‌వర్మను కలసి మాట్లాడినా ఫలితం లేకపోయిందని సమాచారం. దీంతో సీఎస్‌ను మార్చాలంటూ ముఖ్యమంత్రి తరపున కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేశారు. దీంతో, అరుణాచలప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి శరత్ చౌహాన్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, మంగళవారం సచివాలయంలో కొత్త సీఎస్‌గా శరత్‌చౌహాన్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలు శాఖల కార్యదర్శులు, సచివాయల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఎస్ అసెంబ్లీకి చేరుకొని ముఖ్యమంత్రి రంగస్వామిని కలుసుకున్నారు. ఆ సమయంలో సీఎం తిరుపతి నుంచి తీసుకొచ్చిన లడ్డూను అందజేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలసి పనిచేస్తానని ఆయన తెలిపారు.

సమాచార ధ్వని

నేడు నెల్లై వందేభారత్ సహా ఆరు రైళ్లు రద్దు

ప్యారీస్, ఫిబ్రవరి 20: విల్లుపురం - తిరుచ్చి రైల్వే మార్గంలో చేపట్టిన మరమ్మతుల కారణంగా బుధవారం నెల్లై వందేభారత్ సహా ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. చెన్నై - తిరునల్వేలి మధ్య వందేభారత్‌ను రెండు మార్గాల్లో రద్దు చేసింది. అదే విధంగా విరుదాచలం - తిరుచ్చి, తిరుప్పాదిరి పులియూర్ - తిరుచ్చి, దిండుగల్ - విల్లుపురం మార్గంలో ఇరువైపులా నడిపే రైళ్ల సేవలను కూడా బుధవారం రద్దు చేసింది. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఇతర మార్గానికి మళ్లించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

24న సూలేరికాడు వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: నెమ్మేలి పంచాయతి సూలేరికాడు వాటర్ ప్లాంట్‌ను ఈ నెల 24వ తేది సీఎం స్టాలిన్ ప్రారంభించనున్నారు. చెన్నై తాగునీటి బోర్డు ఆధ్వర్యంలో ప్రతిరోజు 10 కోట్ల లీటర్ల సముద్రపు నీటిని తాగునీరుగా మార్చే మొదటి విభాగం ప్లాంట్ సూలేరికాడులో 2013 నుంచి పనిచేస్తోంది. అదే విభాగంలో రోజు 15 కోట్ల లీటర్ల తాగునీటి ప్లాంట్‌ను రూ.1,516.83 కోట్లతో ఏర్పాటు చేశారు. ఈ నిర్లవణీకరణ కేంద్రాన్ని 24వ తేది సీఎం ప్రారంభిస్తారు.

సెయింట్ థామస్ మౌంట్‌లో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: మెట్రోరైలు పనుల కారణంగా సెయింట్ థామస్ మౌంట్‌లో ఈనెల 21న బుధవారం నుంచి వారం రోజులు ట్రాఫిక్ మార్పులు ఉంటాయని పోలీసు శాఖ తెలిపింది.

- జీఎస్‌టీ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు యథావిధిగా అలందూర్ సబ్ వే మీదుగా ఎడమ వైపు తిరిగి వెళ్లాలి. ఈ రోడ్డులో భారీరకం వాహనాలకు అనుమతి లేదు.
- ఎంకేఎన్ రోడ్డు, రైల్వేస్టేషన్ జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు నేరుగా మౌంట్ పోస్టాఫీసు మీదుగా వెళ్లేందుకు నిషేధం.
- అలందూర్ సబ్‌వే నుంచి వచ్చే వాహనాలు జీఎస్‌టీ రోడ్డులో వెళ్లేందుకు కుడివైపు కానీ, ఎడమ వైపు కానీ తిరిగి వెళ్లవచ్చు.

పెరిగిన కూరగాయల ధరలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: స్థానిక కోయంబేడు మార్కెట్లో కొన్ని కూరగాయల ధరలు పెరిగాయి. దిగుమతి తగ్గడంతో రూ.30 ఉన్న కిలో బీన్స్ రూ.50, రూ.20కు విక్రయమైన క్యారెట్ రూ.80, రూ.50కి విక్రయమైన మునక్కాయలు రూ.80కు విక్రయమయ్యాయి. అలాగే, టమోటా కిలో రూ.25, పెద్ద ఉల్లి రూ.24, చిన్న ఉల్లి రూ.40, బంగాళాదుంపలు రూ.30, బీట్‌రూట్ రూ.60, చౌచౌ రూ.16, ముల్లంగి రూ.13, క్యాబేజీ రూ.22, బెండకాయలు రూ.35, చిక్కుడు రూ.25, వంకాయలు రూ.35కు విక్రయమవుతున్నాయి.

నేడు మాతృభాషా దినోత్సవం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: స్థానిక తాంబరం క్రిస్టియన్ కళాశాలలో ప్రపంచ మాతృభాషా దినోత్సవాలు నిర్వహించనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. యునెస్కో సంస్థ 1999లో ప్రకటించిన మేరకు ఫిబ్రవరి 21వ తేది ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని తమిళ అభివృద్ధి శాఖ జరుపుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది ఉత్సవాలను బుధవారం తమిళ అభివృద్ధి శాఖ డైరెక్టర్ ఔవై అరుళ్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ కళాశాల ఆండర్సన్ ఆడిటోరియంలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో తమిళ అభివృద్ధి, సమాచార శాఖ మంత్రి స్వామినాథన్, తమిళ అభివృద్ధి శాఖ కార్యదర్శి సుబ్రమణియన్ తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

ప్లస్ టూ పరీక్షా హాల్‌టిక్కెట్ల విడుదల

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల హాల్‌టిక్కెట్లను పరీక్ష శాఖ మంగళవారం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్టేట్ సిలబస్‌లో చదివే ప్లస్ టూ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి 22వ తేది వరకు జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెలాఖరులోపు ముగించాలని పరీక్ష శాఖ సూచించింది. అలాగే, ప్లస్ వన్ విద్యార్థులకు మార్చి 4 నుంచి 25 వరకు, టెన్త్ విద్యార్థులకు మార్చి 26 నుంచి ఏప్రిల్ 8వ తేది వరకు పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో, ప్లస్ టూ పరీక్షల హాల్‌టిక్కెట్లు మంగళవారం విడుదల కాగా, విద్యార్థులు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది.

27వరకు పాపనాశం చెక్‌పోస్ట్ మూసివేత

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: పులుల గణన మంగళవారం ప్రారంభం కావడంతో మణిముత్తారు, పాపనాశం అటవీ శాఖ చెక్‌పోస్టులు ఈనెల 27వ తేది వరకు మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తిరునల్వేలి జిల్లా పశ్చిమ కనుమల ప్రాంతాల్లో తిరుకురంకుడి నుంచి కడయం వరకు 895 చ.కి.మీ విస్తీర్ణంలో కలక్కాడు ముండతురై పులుల శరణాలయం ఉంది. ఇక్కడ వన్యమృగాలతో పాటు ఔషధ మొక్కలు కూడా ఉన్నాయి. యేటా పులుల గణన జరుగుతుంది. ఈ ఏడాది అంబై, పాపనాశం, కడయం, ముండతురై వంటి అటవీ ప్రాంతాల్లో మంగళవారం ప్రారంభమైన గణన 27వ తేది వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా గణన పూర్తయ్యే వరకు పాపనాశం, మణిముత్తారు చెక్‌పోస్టులు తాత్కాలికంగా మూసివేసి... అగస్తియర్, మణిముత్తారు జలపాతాలు, మాంజోలై, సొరిముత్తుఅయ్యనార్ ఆలయాల ప్రాంతాలకు ప్రజలు వెళ్లడంపై అటవీ శాఖ నిషేధించింది.

నేడు సబర్బన్ రైళ్ల పాక్షిక రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 20: తిరువళ్లూర్ జిల్లా సింగపెరుమాళ్ కోయిల్ - చెంగల్పట్టు మధ్య రైలు మార్గంలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఈనెల 21న బుధవారం మధ్యాహ్నం 1.16 నుంచి 2.15 గంటల వరకు చెన్నై బీచ్ - చెంగల్పట్టు మధ్య సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టుకు ఉదయం 11.40, మధ్యాహ్నం 1.20 గంటలకు బయల్దేరే సబర్బన్ రైళ్లు, చెంగల్పట్టు నుంచి మధ్యాహ్నం 1.00, 1.45 గంటలకు చెన్నై బీచ్‌కు వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

మూర్‌మార్కెట్ - సూళ్లూరుపేట...

కొరుక్కుపేట - బేసిన్ బ్రిడ్జి మధ్య చేపట్టనున్న మరమ్మతుల కారణంగా మూర్ మార్కెట్ - సూళ్లూరుపేట మార్గంలో రైళ్లు పాక్షికంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. సూళ్లూరుపేట - మూర్‌మార్కెట్ మధ్య ఈనెల 21 నుంచి 29వ తేది వరకు, మార్చి 1, 2 తేదీల్లో సూళ్లూరుపేట నుంచి రాత్రి 9.40 గంటలకు బయల్దేరే రైలు మూర్‌మార్కెట్‌కు బదులుగా చెన్నై బీచ్‌కు వెళుతుంది.

- మూర్‌మార్కెట్ - ఆవడికి రాత్రి 11.45 గంటలకు బయల్దేరే సబర్బన్ రైలు ఈనెల21 నుంచి 29వ తేది వరకు, మార్చి 1,2 తేదీల్లో మూర్‌మార్కెట్‌కు బదులుగా చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతుంది.

27న తిరుప్పూర్‌కు ప్రధాని మోదీ



- బీజేపీ బహిరంగసభకు హాజరు
- 28న కులశేఖరపట్టినం రాకెట్ ప్రయోగ కేంద్రానికి శంకుస్థాపన

పెరంబూర్, ఫిబ్రవరి 20: ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం ఈనెల 27వ తేది రాష్ట్రానికి రానున్నారు. తిరుప్పూర్ జిల్లాలో నిర్వహించే బీజేపీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం ఆయన అక్కడి నుంచి కేరళ రాష్ట్రానికి బయల్దేరి వెళతారు. రెండో రోజైన బుధవారం ఉదయం కేరళ నుంచి హెలికాప్టర్ ద్వారా తూత్తుకుడికి చేరుకుంటారు. అక్కడి హార్బర్ ప్రాంగణంలోని నిర్వాహక కార్యాలయంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని రెండు మెగా పథకాలను ప్రారంభిస్తారు. ఆ తర్వాత కులశేఖరపట్టినంలో భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) ఆధ్వర్యంలో నిర్మించనున్న రాకెట్ ప్రయోగ కేంద్రానికి ప్రధాని శంకుస్థాపన చేస్తారు. అదే కార్యక్రమంలో రూ.550 కోట్లతో రామేశ్వరం - పాంబన్ సముద్రం మధ్య అత్యాధునిక రైల్వే ఆటోమేటిక్ వంతెనను దేశానికి అంకితం చేస్తారు. ఈక్రమంలో భద్రతా దళానికి చెందిన అధికారులు హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. భారత కోస్ట్‌గార్డ్, సీఐఎస్ఎఫ్ బలగాలు సముద్రంలో 24 గంటలు భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు. అంతేకాకుండా ప్రత్యేక విమానం ద్వారా పాంబన్ నుంచి కన్నియాకుమారి వరకు రోజుకు మూడు సార్లు భద్రతా పనులు చేపడుతున్నారు. అదే విధంగా తూత్తుకుడి హార్బర్ ప్రవేశద్వారం నుంచి 12 కి.మీ పరిధిలో కోస్ట్‌గార్డ్ సిబ్బంది నౌకలో గస్తీ తిరుగుతున్నారు.

1,000 ఎకరాల్లో సిద్ధమవుతున్న మైదానం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై 'ఎన్ మన్...ఎన్ మక్కల్' పాదయాత్ర ముగింపు సందర్భంగా బహిరంగ సభ ఏర్పాటు చేయాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఈ నెల 27న పాదయాత్ర ముగింపు, రాబోయే పార్లమెంటు ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ పాల్గొననుండడంతో తిరుప్పూర్ జిల్లా పల్లడం సమీపం మాదపూర్ ముత్తుకుమారస్వామి కొండ ఎదురుగా 1,000 ఎకరాల్లో సభ కోసం మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ విషయమై ఆ పార్టీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మురుగానందం మాట్లాడుతూ... ఈ సభలో 10 లక్షల మంది పార్టీ కార్యకర్తలు, 3 లక్షల మంది ప్రజలు పాల్గొనేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. 400 ఎకరాల బహిరంగ సభ మైదానం, వాహనాలు నిలిపేందుకు మరో 600 ఎకరాలు ఎంపిక చేశామన్నారు. అలాగే, కార్యకర్తలకు భోజనం, తాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.



మైదానం చదును చేస్తున్న దృశ్యం (పక్కచిత్రంలో) ప్రధాని చిత్రపటంతో ఎగురవేసిన బెలూన్



ఆకట్టుకొనే బొమ్మలతో విద్యార్థినులకు ఆహ్వాన కరపత్రాలు పంచుతున్న బీజేపీ శ్రేణులు

అన్ని ఎయిమ్స్‌లు ప్రారంభం... కానీ మదురై మాత్రం?

- మదురై సీపీఎం ఎంపీ వెంకటేష్

పెరంబూర్, ఫిబ్రవరి 20: జమ్ములో నిర్మించిన ఎయిమ్స్ ఆసుపత్రిని మంగళవారం ప్రారంభించిన ప్రధాని, ఈనెల 25వ తేది గుజరాత్, ఆంధ్ర, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో నిర్మించిన ఎయిమ్స్ ఆసుపత్రులను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో, మదురై సీపీఎం పార్లమెంటు సభ్యుడు వెంకటేష్ తన ఎక్స్‌లో.... మరో ఆరు రోజుల్లో ఆరు ఎయిమ్స్ ఆసుపత్రులను ప్రధాని ప్రారంభిస్తున్నారు. ఒకే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించిన అన్ని ఎయిమ్స్ ఆసుపత్రులు ప్రారంభమయ్యాయి మదురై మినహా. రాష్ట్రానికి మీరు అందించేది తప్పుల తడకగా పలికే తిరుక్కురల్ మాత్రమేనా? అంటూ పలు ఎయిమ్స్ ఆసుపత్రుల ప్రారంభోత్సవ ఫొటోలతో పాటు మదురై ఎయిమ్స్ శంకుస్థాపన ఫొటో కూడా ఎంపీ వెంకటేష్ తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఐదు రాష్ట్రాల్లో పోటీ

డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్



పెరంబూర్, ఫిబ్రవరి 20: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఐదు రాష్ట్రాల్లో తామ పార్టీ అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు డీపీఐ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో 'ఇండియా' కూటమిలో పోటీ చేస్తున్న డీపీఐ, రాష్ట్రంలో డీఎంకే కూటమితో సీట్ల సర్దుబాటుపై తొలివిడత చర్చలు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో, ఢిల్లీలోని ఎన్నికల ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో తమ అభ్యర్థులు పోటీలో ఉంటారని తెలిపారు.ఈ ఎన్నికల్లో తమకు 'కుండ' గుర్తు కేటాయించాలని ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించామని తిరుమా తెలిపారు. కాగా, ఆయన తొలుత మాజీ రాష్ట్రపతి, ఒకే దేశం ఒకే ఎన్నికల కమిటీ అధ్యక్షుడు రామనాథ్ కోవింద్‌ను కలుసుకొని, ఒకే దేశం ఒకే ఎన్నిక అనేది రాజరిక పాలనకు దారితీస్తుందని, అందువల్ల ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పార్టీ తరఫున వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

జీసీసీకి రూ.3.12 కోట్లు అందజేసిన హార్బర్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: చెన్నై కార్పొరేషన్‌కు హార్బర్ రూ.3.12 కోట్లు అందజేసింది. చెన్నై హార్బర్ కమిషన్ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.156.06 కోట్ల అదనపు ఆదాయం ఆర్జించింది.అందులో రూ.3.12కోట్లను సీఎస్సార్ కింద అందజేసింది.ఆ ప్రకారం, రూ.66లక్షలు రాష్ట్రప్రభుత్వ 'నమక్కు నామే' పథకాన్ని ఉత్తర చెన్నైలో అమలు పరిచేందుకు, రూ.99.77లక్షలు చెన్నై వైద్య కళాశాల ఆడిటోరియం పునరుద్ధరణకు, రూ.31.50 లక్షలు దివ్యాంగుల ఉపకరణాలకు, రూ.15.94 లక్షలు ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో స్మార్ట్ తరగతుల ఏర్పాటుకు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఏప్రిల్‌లో పూర్తికానున్న చెట్‌పెట్ - స్టెర్లింగ్ రోడ్డు మెట్రో పనులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: నగరంలో రెండవ విడత మెట్రోరైలు పథకం కింద జరుగుతున్న చెట్‌పెట్ - స్టెర్లింగ్ రోడ్ల మధ్య సొరంగ మార్గం పనులు ఏప్రిల్‌లో పూర్తవుతాయని సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. మాధవరం నుంచి సిరుచ్చేరి సిప్కాట్ వరకు 45.4 కి.మీ మార్గంలో మాధవరం పాల కేంద్రం, గ్రీన్‌వేస్ రోడ్డులో సొరంగ మార్గం పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా చెట్‌పెట్ నుంచి నుంగంబాక్కం వరకు 2.8 కి.మీ గత ఏడాది సెప్టెంబరులో సొరంగ మార్గం తవ్వే పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు ఏప్రిల్ ఆఖరులో పూర్తవుతాయని, ఇదే మార్గంలో చెట్‌పెట్ జలాశయం మీదుగా కీల్పాక్కం వరకు సొరంగం తవ్వే పనులు త్వరలో ప్రారంభించనున్నామని అధికారులు తెలిపారు.

అస్వస్థతకు గురైన బెంగాల్ టైగర్



పులికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: స్థానిక వండలూరు జులాజికల్ పార్కులో ఉన్న బెంగాల్ టైగర్ అస్వస్థతకు గురైంది. ఈ పార్కులో సంరక్షిస్తున్న 21 ఏళ్ల విజయన్ అనే మగసింహం కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. వెటర్నరీ వైద్యులు చికిత్సలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రెండు రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో మళ్లీ వైద్యపరీక్షలు నిర్వహించగా, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిన్నట్లు తెలిసింది. దీంతో అత్యవసర వైద్య చికిత్సా విభాగంలో ఉంచి చికిత్సలందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

అటవీ ప్రాంతంలో నీటి తొట్టెల ఏర్పాటు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: మేట్టుపాళయం అటవీ ప్రాంతంలో నీటి ఎద్దడి తలెత్తడంతో వన్యమృగాల కోసం నీటితొట్టెలు ఏర్పాటు చేశారు. మేట్టుపాళయం అటవీ పరిధిలో అడవి ఏనుగులు, జింకలు, అడవి పందులు, చిరుత వంటి వివిధ రకాల జంతువులున్నాయి. వేసవికి ముందుగానే ఈ ప్రాంతంలో కొన్ని రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది. దాహం తీర్చుకోడానికి జంతువులు నివాస ప్రాంతాలకు వస్తున్నాయి. ఈ సమస్య పరిష్కరించేలా నీటితొట్టెలు ఏర్పాటుచేసి ట్యాంకర్లతో నీటిని నింపుతున్నారు.

పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం



సూచనలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఫిబ్రవరి 20: పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం మంగళవారం జరిగింది. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పబ్లిక్ పరీక్షల కేంద్రాలు, చేపట్టాల్సిన భద్రతా చర్యలు, తాగునీరు తదితర మౌలిక వసతులు, పరీక్షా కేంద్రాల వద్ద వైద్యశిబిరం తదితరాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, ఏడీఎస్పీ గౌతమన్, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, వేలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి ప్రిన్సిపాల్ పాపాత్తి, కలెక్టర్ పీఏ (జనరల్) కలియమూర్తి, జిల్లా ఆదిద్రావిడుదల సంక్షేమ శాఖ అధికారి రామచంద్రన్, ఆరోగ్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌పీఎస్సీ ద్వారా 213 మంది ఎంపిక

- మంత్రి టీఎం అన్బరసన్

ప్యారీస్, ఫిబ్రవరి 20: తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నగరాభివృద్ధి బోర్డుకు 213 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు రాష్ట్ర మంత్రి టీఎం అన్బరసన్ పేర్కొన్నారు. నగరంలోని తమిళనాడు నగరాభివృద్ధి బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం టీఎన్‌పీఎస్సీ ద్వారా ఎంపిక చేసిన 63 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు సహా 68 మందికి ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అన్బరసన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... టీఎన్‌పీఎస్సీ ద్వారా బోర్డుకు 64 మంది సహాయకులు, 68 మంది బిల్ కలెక్టర్లు, ఏడుగురు స్టెనోగ్రాఫర్లు, 11 మంది కమ్యూనిటీ అధికారులను రాతపరీక్షల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు ఇప్పటివరకు 213 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు అభివృద్ధి శాఖ కార్యదర్శి సమయమూర్తి, మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తమిళ జాలర్లను విడిపించాలని కోరుతూ రామేశ్వరంలో నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీలో మత్స్యకారులు

ప్యారీస్, ఫిబ్రవరి 20: శ్రీలంక జైలులో మగ్గుతున్న 23 మంది తమిళ జాలర్లను విడిపించాలన్న డిమాండ్‌తో మంగళవారం రామనాథపురం జిల్లా రామేశ్వరంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో వందలాది మంది మత్స్యకారులు పాల్గొన్నారు. రామేశ్వరం నుంచి ఈనెల 4వ తేది వందలాది మంది జాలర్లు పడవల్లో చేపల వేటకు వెళ్లారు. అప్పుడు 23 మంది జాలర్లను అరెస్ట్ చేసిన శ్రీలంక నావికాదళ సిబ్బంది, రెండు మర పడవలను స్వాధీనం చేసుకున్నారు. వారిని శ్రీలంక న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది. ఈ నేపథ్యంలో, గత వారంలో 20 మంది తమిళ జాలర్లను శ్రీలంక ప్రభుత్వం విడుదల చేసింది. మిగతా ముగ్గురికి ఏడాది జైలుశిక్ష విధించడాన్ని ఖండించడమే కాకుండా జాలర్లను విడిపించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ రామేశ్వరం ప్రాంత జాలర్లు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరుకుంది. మరోవైపు విధుల్లో పాల్గొనే రాష్ట్ర జాలర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కచ్చాదీవిలోని సెయింట్ ఆంథోనియార్ చర్చి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొనబోమని రామనాథపురం జిల్లా జాలర్లు ప్రకటించారు. కాగా, రామనాథపురం కలెక్టర్ కార్యాలయం వైపు చేపట్టిన నిరసర ర్యాలీలో మత్స్యకారులు పాల్గొని శ్రీలంక నావికాదళ సిబ్బంది వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు.

సెంథిల్ బాలాజి రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 20: సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను 22వ సారి చెన్నై ప్రత్యేక సెషన్స్ కోర్టు పొడిగించింది. చట్టవ్యతిరేక నగదు మార్పిడి చట్టం కింద సెంథిల్ బాలాజిని గత ఏడాది జూన్ 14వ తేది అరెస్ట్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఆయన్ను పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ నేపథ్యంలో, ఆయనకు విధించిన రిమాండ్ మంగళవారంతో ముగియడంతో, జైలు నుంచే ఆయన్ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెన్నై జిల్లా 3వ ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆనంద్ ఎదుట హాజరుపరచగా, సెంథిల్ బాలాజికి మార్చి 4వ తేది వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, బెయిల్ కోరుతూ సెంథిల్ బాలాజి దాఖలుచేసి పిటిషన్ మంగళవారం విచారించిన కోర్టు, ఈ వ్యవహారంలో అఫిడవిట్ దాఖలు చేయాలని ఈడీకి నోటీసు జారీచేసింది.

నేడు రవాణా కార్మిక సంఘాలతో చర్చలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 20: రవాణా కార్మిక సంఘాలతో బుధవారం అధికారులు చర్చలు జరపనున్నారు. ఖాళీ పోస్టుల భర్తీ, కొత్త పింఛన్ విధానం రద్దు వంటి ఆరు డిమాండ్లతో ప్రభుత్వ రవాణా సంస్థ కార్మిక సంఘాలు గత కొన్ని నెలలుగా ఆందోళన చేపడుతున్నాయి. ఇప్పటికే పలు విడతలుగా అధికారులు సంఘాలతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో, జాయింట్ కమిషనర్ సమక్షంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సంఘ ప్రతినిధులతో చర్చలు జరుగనున్నాయి.

అన్నాడీఎంకే తరఫున రెండువేల మందికి సహాయాల పంపిణీ



సహాయాలు అందిస్తున్న కుప్పన్, రాయపురం మనో తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 20: ఉత్తర చెన్నై అన్నాడీఎంకే ఆధ్వర్యంలో తిరువొత్తియూర్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి సందర్భంగా సహాయాలు పంపిణీ చేశారు. ఎన్నూర్ తాళంకుప్పం మత్స్యకారుల గ్రామంలో అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే కె.కుప్పన్ అధ్యక్షతన జయలలిత జయంతిని పురస్కరించుకొని సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్ రాయపురం మనో కౌన్సిలర్ డాక్టర్ కార్తీక్ తదితరులు అన్నాడీఎంకే ప్రభుత్వం అమలుచేసిన పథకాల గురించి ప్రసంగించారు. బడుగు, బలహీనవర్గాలు, రైతుల సంక్షేమం కోసం అన్నాడీఎంకే ప్రవేశపెట్టిన పథకాలను డీఎంకే ప్రభుత్వం అటకెక్కించిందని ఆరోపించారు.

వినతిపత్రాల రసీదులు మాల

- కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన రైతు



రసీదులతో కలెక్టర్ కార్యాలయానికి వస్తున్న రైతు కృష్ణన్‌మూర్తి

పెరంబూర్, ఫిబ్రవరి 20: వేలూరు జిల్లా కుక్కలపల్లికి చెందిన రైతు కృష్ణన్‌మూర్తి, తను నివసిస్తున్న ప్రాంతం సమీపంలో ఉన్న నది చుట్టూ ఆక్రమణలు తొలగించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏడాదిగా వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నాడు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో, కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చిన వినతి పత్రాలకు అందజేసిన రసీదులను మాలగా ధరించి సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన కృష్ణన్‌మూర్తి, ఆక్రమణలు తొలగించాలని మరోసారి వినతిపత్రం అందజేసి రసీదు తీసుకెళ్లారు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు: డ్రైవర్ అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 20: స్థానిక అడయార్‌లో కళాశాల విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. హాస్టల్‌లో బస చేస్తూ ఓ ప్రైవేటు కళాశాలలో చదువుకుంటున్న 20 ఏళ్ల విద్యార్థిని సోమ వారం రాత్రి దుకాణానికి నడిచి వెళుతున్న సమయంలో అటుగా వెళ్లిన ఓ వ్యక్తి తనను బెదిరించి లైంగిక వేధించినట్లు తిరువాన్మియూర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన పోలీసులు, సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించి, మందవెల్లికి చెందిన జోషువా(50) అనే కారు డ్రైవర్ మంగళవారం ఉదయం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

హైపర్ లింక్ యాప్ 'కిన్' ఆవిష్కరణ



యాప్ ఆవిష్కరణలో ప్రముఖులు

అడయార్, ఫిబ్రవరి 20: కిన్‌హుడ్ టెక్నాలజీస్ రూపొందించిన హైపర్ లోకల్ యాప్ 'కిన్'ను రాష్ట్ర సమాచార, ఐటీ శాఖ మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్ నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. 'నో యువర్ నైబర్‌హుడ్ (కె.వై.ఎన్ - కిన్) పేరుతో ఈ యాప్‌ను లోకల్ కమ్యూనిటీ కోసం రూపొందించారు. తమ ప్రాంతంలో జరిగే వివిధ రకాల కార్యక్రమాలు, ఈవెంట్లు, కొత్తగా వచ్చిన షాపులు, వస్తువులు ఇలా ప్రతి సమాచారాన్ని తెలుసుకునేలా, ఎప్పటికపుడు సమాచారాన్ని షేర్ చేసేలా ఈ యాప్‌ను రూపొందించారు. కిన్‌హుడ్ టెక్నాలజీ సీఈవో గాయత్రి త్యాగ రాజన్ మాట్లాడుతూ... హైపర్ లోకల్ కమ్యూనిటీ కోసం టెలివిజన్, ప్రింట్, సోషల్ మీడియాను అనుసంధానించే ప్లాట్‌ఫాంగా కిన్ ఉంటుందన్నారు. ఇందుకోసం చెన్నైను 14 జోన్లుగా విభజించినట్లు తెలిపారు. ప్రతి జోన్‌లో స్వతహాగా టెలివిజన్, ప్రింట్, సోషల్ మీడియా ఇండిపెండెంట్ జర్నలిస్టులు ఉంటారన్నారు. కిన్ అనేది ఇరుగుపొరుగున ఉన్న గృహ వ్యాపారవేత్తలు, చిన్న వ్యాపారులు వారి, మార్కెట్‌ను పెంచుకోవడంలో కూడా దోహదపడుతుందన్నారు.

గ్రేట్ లేక్స్‌లో 'ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ కోర్స్'



కోర్సు ప్రారంభోత్సవంలో ప్రముఖులు

అడయార్, ఫిబ్రవరి 20: నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ గ్రేట్ లేక్స్ కొత్తగా కటింగ్ ఎడ్జ్ ఫెలో ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం) కోర్సును ప్రవేశపెట్టింది. ఇది డాక్టోరల్ ప్రోగామ్ కోర్సు అని గ్రేట్ లేక్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ రామనాథన్ చెప్పారు. ఈ ఎఫ్‌పీఎం కోర్సు ప్రారంభోత్సవంలో మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఛైర్మన్, భారత రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ డాక్టర్ సి.రంగరాజన్ పాల్గొన్నారు. ఇందులో రంగరాజన్ మాట్లాడుతూ... 'జ్ఞాన వ్యాప్తి ఎంత అవసరమో పరిశోధన కూడా అంతే ముఖ్యమన్నారు. అంతిమంగా సంస్థ అనేది ఇప్పటికే ఉన్న జ్ఞానాన్ని అందించడం ద్వారా మాత్రమే కాకుండా కొత్త జ్ఞానాన్ని సృష్టించడం లేదా వృద్ధి చేయడం ద్వారా సమర్థించబడుతుందని, ఈ లక్ష్యం దిశగా చెన్నై గ్రేట్ లేక్స్ ఇనిస్టిట్యూట్ ముందుకు సాగడం పట్ల సంతోషిస్తున్నట్లు పేర్కొన్నారు.

'వీడియో కాల్'లో నగ్నంగా వేధింపులు

- యువకుడిని అరెస్ట్ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, ఫిబ్రవరి 20: వీడియో కాల్‌లో నగ్నంగా ఉండి అంగన్వాడీ మహిళా ఉద్యోగిని వేధించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నాగపట్టినం జిల్లాకు ఓ అంగన్వాడీ మహిళా ఉద్యోగి సెల్‌ఫోన్‌కు గత 2022 అక్టోబరు నెలలో వీడియో కాల్ వచ్చింది. ఆ కాల్ లిఫ్ట్ చేసిన వెంటనే ఓ వ్యక్తి నగ్నంగా ఉండి ఆమెతో అసభ్యంగా మాట్లాడాడు. ఈ వ్యవహారంపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో సీబీసీఐడీ విచారణ కోరుతూ బాధిత మహిళ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి ఎన్.ఆనంద్ వెంకటేష్ విచారించారు. ఆ సమయంలో పోలీసుల తరఫున... ఫిర్యాదు ఆధారంగా ఆ సెల్‌ఫోన్ నెంబరు గురించి విచారించగా, దిండుగల్‌కు చెందిన లారీ డ్రైవర్ వసంతరాజన్‌దిగా గుర్తించామని, వివాహమైన అతను భార్యతో విబేధించి వేరుగా నివసిస్తున్నాడని, విచారణ సక్రమంగా జరుగుతోందని, అందువల్ల సీబీసీఐడీ విచారణకు అవసరం లేదని వాదించారు. అనంతరం పిటిషన్‌దారుడి తరఫున... పిటిషన్‌దారుడి సెల్ నెంబరు ఆ వ్యక్తికి ఎలా దొరికిందో విచారించాలని వాదించారు. ఇరు తరఫు వాదనలు విన్న న్యాయమూర్తి, నాగపట్టినం జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఈ కేసులో విచారణ జరగాలని, నేరారోపణ ఎదుర్కొంటున్న వ్యక్తిని అరెస్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసి, విచారణను వాయిదా వేశారు.

రోడ్డు, కాలువల నిర్మాణం కోసం సంతకాల సేకరణ



వేలూరు, ఫిబ్రవరి 20: స్థానిక 22వ వార్డు పరిధిలోని పులవర్‌నగర్‌లో 15 ఏళ్లుగా సరైన రోడ్డు, మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు లేకపోవడంతో మురుగు రోడ్లపై పారడమే కాకుండా ఇళ్ల చుట్టూ నిల్వ ఉంది దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడద అధికంగా ఉందని వారు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో, స్థానిక రంగాపురానికి చెందిన సమాజ సేవకుడు దినేష్ శరవణన్ నేతృత్వంలో, ఆ ప్రాంతంలో రోడ్డు, మురుగునీటి కాలువ నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ ప్రజలచే సంతకాలు సేకరించారు.



'ఎన్ శ్వాసమే' ఆడియో రిలీజ్ దృశ్యం

కళకు ప్రాంతీయభేదాలు లేవు

చిత్రజ్యోతి

● దర్శకుడు ఆర్.వి. ఉదయకుమార్

కళకు భాష, ప్రాంతీయభేదాలు లేవని, అందువల్ల తమిళ సినీ కళాకారులు మలయాళ చిత్రపరిశ్రమకు చెందిన కళాకారుల నుంచి అనేక మంచి విషయాలు నేర్చుకోవాలని ప్రముఖ దర్శకుడు ఆర్.వి. ఉదయకుమార్ పిలుపునిచ్చారు. కొత్త ముఖాలు నటించిన 'ఎన్ శ్వాసమే' చిత్ర ఆడియో రిలీజ్ వేడుక చెన్నైలో జరిగింది. సినీ ప్రముఖులు పేరరసు, కె.రాజన్‌తో పాటు చిత్రయూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఇందులో ఆర్.వి.ఉదయకుమార్ మాట్లాడుతూ... 'శ్వాస లేకుండా ప్రాణం లేదు. ప్రాణానికి ఆధారం గాలి. 'ఎన్ శ్వాసమే' టైటిల్‌ను ఎంచుకున్నందుకు చిత్ర బృందాన్ని అభినందిస్తున్నా. ఈ సినిమాను మలయాళ కళాకారులు తెరకెక్కించారు. మలయాళం అంటే నాకు అమితమైన ఇష్టం. దేశంలో మలయాళ కళాకారులకు ప్రత్యేక గుర్తింపుతో పాటు పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. మాలీవుడ్‌లో కథకు అత్యధిక ప్రధాన్యం ఇస్తారు. కథే ముఖ్యంగా వారు సినిమాలు నిర్మిస్తారు. అలాంటి కళాకారుల నుంచి తమిళ సినీ కళాకారులు మెలకువలను నేర్చుకోవాలి. కళకు భాషతో పనిలేదు? మలయాళ కళాకారులు నాకు ఎంతో ఇష్టం. కానీ, వారికి తమిళ కళాకారులు అంటే ఇష్టం లేదు. ఫాజిల్, భరతన్, షాజి కైలాస్... ఇలా అనేక మంది ఒకప్పుడు తమిళ చిత్ర పరిశ్రమలో ఓ వెలుగు వెలిగారు. అనేక సూపర్ హిట్ తమిళ చిత్రాలను రూపొందించారు. కానీ, తమిళ దర్శకులకు మలయాళంలో అవకాశాలు ఇవ్వడం లేదు. ఎక్కడో ఒక అవకాశం వస్తే.. దానికి ఏదో ఒక రూపంలో ఆటంకాలు సృష్టిస్తున్నారు. ఈ వేడుకకు వచ్చిన సీనియర్ మలయాళ కళాకారులు ఈ విషయాన్ని మాలీవుడ్ పరిశ్రమకు చెందిన పెద్దల దృష్టికి తీసుకెళ్లాలి' అని కోరారు. కాగా, మలయాళ కెమెరామెన్ మణి ప్రసాద్ దర్శకత్వం వహించిన 'ఎన్‌శ్వాసమే' చిత్రంలో సంజయ్ కుమార్,అర్జున్ కుమార్, జనని నిర్మించారు.ఆదర్శ్, శాండ్రా హీరోహీరోయిన్లు. కొల్లపుల్లి లీలా,అంబికా మోహన్ వంటి సీనియర్ నటులు ఇతర పాత్రలను పోషించారు.

'థగ్ లైఫ్' కోసం సినిమాలు వదులుకున్న ఐశ్వర్య లక్ష్మి



విశ్వనటుడు కమలహాసన్ నటించే 'థగ్‌లైఫ్' కోసం మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి ఏకంగా మూడు సినిమా అవకాశాలను వదులుకున్నారు. మణిరత్నం దర్శకత్వంలో రూపొందే ఈ చిత్రంలో ఐశ్వర్యలక్ష్మి ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లకు ఎలాంటి ఇబ్బంది ఉండరాదన్న ఉద్దేశంతో ఆమె ఏకంగా మూడు సినిమా అవకాశాలను వదులుకున్నారు. వీటిలో ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కే కార్తీ27, ప్రేమ్‌కుమార్ సతీమణి దర్శకత్వం వహించే మరో చిత్రం, ఏఎల్ విజయ్ తెరకెక్కించే కొత్త చిత్రంలో నటించే అవకాశం వచ్చినప్పటికీ ఆమె 'థగ్‌లైఫ్' కోసం వదులుకున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. కాగా, ఐశ్వర్య లక్ష్మి తమిళంలో 'జగమే తందిరమ్', 'యాక్షన్', 'గట్టాకుస్తీ', 'పొన్నియిన్ సెల్వన్' తదితర చిత్రాల్లో నటించి మంచి పేరుతో పాటు క్రేజ్‌ను సొంతం చేసుకున్నారు.

రూ.500 కోట్లతో ఫిల్మ్ సిటీ నిర్మాణం



ఎన్.మురళి

● ధన్యవాదాలు తెలిపిన నిర్మాతల మండలి

నగర శివారు ప్రాంతమైన పూందమల్లిలో రూ.500 కోట్లతో అధునాతన సౌకర్యాలతో ఫిల్మ్ సిటీని నిర్మించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో ప్రకటించింది. ఈ ప్రకటనపై తమిళనాడు నిర్మాతల మండలి హర్షం వ్యక్తం చేసింది. ఇదే విషయంపై నిర్మాతల మండలి అధ్యక్షుడు ఎన్.మురళి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో చిత్ర నిర్మాణాలకు అనువైన మౌలిక సదుపాయాలు లేని కారణంగా ప్రభుత్వం పూందమల్లి వద్ద అత్యాధునిక సౌకర్యాలతో ఫిల్మ్ సిటీ నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నాం. ఫిల్మ్ సిటీ నిర్మాణం కోసం వార్షిక బడ్జెట్‌లో రూ.500 కోట్ల నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు తమిళ చిత్రపరిశ్రమ, నిర్మాతల మండలి తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. ఈ ఫిల్మ్ సిటీ నిర్మాణం పూర్తయితే నిర్మాతలకు నిర్మాణ వ్యయం తగ్గడమేకాకుండా, రాష్ట్రానికి చెందిన సినీ నిర్మాణ కార్మికులకు నిరంతరం ఉపాధి లభిస్తుందని మురళి ఆశాభావం వ్యక్తం చేశారు.

8 వారాల తర్వాతే ఓటీటీలకు ఇవ్వాలి

● లేదంటే థియేటర్లు మూసివేస్తాం

● యజమానుల షరతు



విలేకరుల సమావేశంలో తిరుపూర్ సుబ్రమణ్యం తదితరులు

సినిమా విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌కు ఇవ్వాలని తమిళనాడు సినిమా థియేటర్ల యజమానుల సంఘం అధ్యక్షుడు తిరుపూర్ సుబ్రమణ్యం కోరారు. ఈ సంఘ సర్వసభ్య సమావేశం మంగళవారం వడపళనిలోని ఒక స్టార్ హోటల్‌లో జరిగింది. ఇందులో చేసిన తీర్మానాలను ఆయన మీడియాకు వివరించారు. 'కొత్త సినిమాలను ఓటీటీకి ఎనిమిది వారాల తర్వాతే ఇవ్వాలి. ప్రస్తుతం ఈ గడువు రెండు వారాలుగా ఉంది. రాష్ట్ర వినోద పన్ను 8 శాతంగా ఉందని దీన్ని పూర్తిగా రద్దు చేయాలి. ఈ తరహా పన్ను దేశంలోని ఏ ఇతర రాష్ట్రాల్లో లేదు. ఈ విషయంపై త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేస్తాం. థియేటర్ నిర్వహణ పన్నును పెంచాలి. ఏసీ థియేటర్లకు రూ.10, నాన్ ఏసీ థియేటర్‌కు రూ.5 చొప్పున వసూలు చేసేలా నిర్ణయించాలి. అదేవిధంగా సినిమాల షేర్ మొత్తం ఇప్పుడు అధికంగా ఉందని, వచ్చే 1వ తేదీ నుంచి ఈ మొత్తాన్ని 60 శాతంగా మాత్రమే చెల్లిస్తాం' అని తెలిపారు. ఇంకా ఏమన్నారంటే... చిన్న బడ్జెట్ చిత్రాలకు వసూలు చేసే టిక్కెట్ ధరలు కచ్చితంగా తగ్గే అవకాశం ఉందని క్రికెట్ వంటి స్థానిక క్రీడా పోటీలను థియేటర్లలో లైవ్ టెలికాస్ట్ చేసేందుకు ప్రభుత్వ అనుమతి కోరనున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఆర్.పన్నీర్‌సెల్వం, కోశాధికారి డీసీ ఇళంగోవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది ఆలయాల నగలు ఎస్‌బీఐలో డిపాజిట్

● మంత్రి శేఖర్‌బాబు



బంగారు కడ్డీలను ఎస్బీఐ సీజీఎంకు అప్పగిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, ఫిబ్రవరి 20: ఎనిమిది ఆలయాలకు చెందిన 130 కిలోల నగలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో డిపాజిట్ చేసినట్లు హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. స్థానిక నుంగంబాక్కం హైరోడ్డులోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఉదయం హైకోర్టు, సుప్రీంకోర్టుల విశ్రాంత న్యాయమూర్తులు దురైస్వామిరాజు, కె.రవిచంద్రబాబు, ఆర్.మాల సమక్షంలో 8 ఆలయాలకు భక్తులు కానుకలుగా సమర్పించిన 130.393 కిలోల బంగారు నగలను ముంబైలో ఉన్న కేంద్రప్రభుత్వ ఆధీనంలోని మింట్ ఫ్యాక్టరీలో కరిగించి గోల్డ్ డిపాజిట్ పథకం కింద ఎస్బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రఘురంజన్ వద్ద అప్పగించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఆలయాల నగలను బ్యాంక్‌లో డిపాజిట్ చేసి దాని ద్వారా వచ్చే వడ్డీతో ఆయా ఆలయాల్లో కనీస వసతులు, ఉత్సవాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పెరియపాళయం, ఇరుకంగుడి, తిరువేర్కాడు, మాంగాడు, తిరుచెందూర్ అనే ఐదు ఆలయాలకు చెందిన 344 కిలోల బంగారాన్ని డిపాజిట్ చేయడం ద్వారా సంవత్సరానికి రూ.4.31 కోట్ల వడ్డీని ఆయా ఆలయాలకే అప్పగించామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఆలయాల్లో భక్తులకు వినియోగించే ప్రసాదాల్లో నాణ్యతలోపం లేకుండా ఉండేలా ఆలయ అధికారులు, నిర్వాహకులకు ఉత్తర్వులు జారీ చేశామని, ఈ వ్యవహారంలో నిర్లక్ష్యం చూపితే సంబంధిత ప్రసాద దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని మంత్రి శేఖర్‌బాబు హెచ్చరించారు.



పురస్కారగ్రహీతలు, విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

మాతృభాషను మరవొద్దు

●సినీ గేయరచయిత భువనచంద్ర ● ఎస్‌కేపీసీలో ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్యారీస్, ఫిబ్రవరి 20: జన్మనిచ్చిన తల్లి అద్భుతమైన మాతృభాష అనే ఆయుధాన్ని మనకిచ్చిందని, ఆ మాధుర్యాన్ని ఇతరులకు పంచిపెట్టి భాషాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని, ఎక్కడున్నా మాతృభాషను మరువద్దని ప్రముఖ సినీ గేయరచయిత భువనచంద్ర పిలుపునిచ్చారు. జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎకేపీసీ) రజతోత్సవాలు,అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగుశాఖ నిర్వహణలోని 'సృజన తెలుగు భాషా మండలి'ఆధ్వర్యంలో 'భాష అభిలాష' పేరిట సన్మాన సంబరాలు, సంగీత సాహితీచంద్ర సాయికృష్ణ యాచేంద్ర సారధ్యంలో 'అనుపమాన సంగీత గేయధార'ను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఉదయం 10 గంటలకు కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామ పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం 414వ కార్యక్రమంగా అనుపమాన సంగీత గేయధార కార్యక్రమాన్ని సాయికృష్ణ యాచేంద్ర వీనులవిందుగా సాగించి శ్రోతల మెప్పు పొందారు. ప్రాశ్నికులుగా భువనచంద్ర, డాక్టర్ కాసల నాగభూషణం,నూకల హనుమంతరావు, శోభారాజ, ఎస్‌కేపీసీ సంచాలకులు డాక్టర్ టి.మోహనశ్రీ, తెలుగు శాఖ అధ్యాపకురాలు డాక్టర్ పీఎస్ మైథిలి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన భాషా అభిలాష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవహరించిన భువనచంద్ర, సుపరిచితులైన డాక్టర్ ఎస్.యజ్ఞశేఖర్, ఎ.మునిరత్నంలకు 'ధృవతార', దేవరకొండ రాజు, లావణ్య శ్రీనివాస్‌కు 'అభిజ్ఞ', పి.మారుతికి 'ఉద్భవ' పురస్కారాలు బహూకరించగా, నిర్వాహకులు వారిని జ్ఞాపికలు, శాలువలు, పూలమొక్కలతో ఘనంగా సత్కరించారు. కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, ఎస్‌కేపీడీ నిర్వహణలోని ప్రాథమిక, మహోన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడలూరులో శ్వేతనాగు పట్టివేత



పట్టుబడిన శ్వేత నాగు

పెరంబూర్, ఫిబ్రవరి 20: కడలూరు సమీపంలో శ్వేత నాగును పాములు పట్టే వ్యక్తి బంధించారు. పచ్చయాంకుప్పంలో హార్డ్‌వేర్ వర్క్స్ దుకాణాన్ని లెనిన్ నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణంలో పాము వెళ్లడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు లెనిన్‌కు సమాచారం అందించారు. లెనిన్ దుకాణం వద్దకు చేరుకొని పరిశీలించగా, అది అరుదైన పాము రకానికి చెందినదని గుర్తించాడు. ఈ విషయాన్ని పాములు పట్టే సెల్వంకు తెలియజేయడంతో, అతను వచ్చి పామును బంధించి సమీపంలోని అడవిలో వదిలిపెట్టాడు.

కోయంబేడు మార్కెట్‌కు పెరిగిన పుచ్చకాయల దిగుమతి





పెరంబూర్, ఫిబ్రవరి 20: స్థానిక కోయంబేడు మార్కెట్‌కు పుచ్చకాయల దిగుమతి అధికమైంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొద్దిరోజులుగా ఎండ తీవ్రత అధికమవుతోంది. దీంతో, మధ్యాహ్నం వేళల్లో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా చెరకు రసం, జ్యూస్, కొబ్బరి నీళ్ల సహా రకాల శీతల పానీయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, వేసవిలో శరీరానికి చల్లదనాన్నిచ్చే పుచ్చకాయల విక్రయాలు కూడా పెరుగుతున్నాయి. దీంతో, కోయంబేడు పండ్ల మార్కెట్‌కు చెంగల్పట్టు, తిరువణ్ణామలై, విల్లుపురం, మదురై తదితర జిల్లాల నుంచి ప్రతిరోజు 20 లారీల్లో సుమారు 200 టన్నుల పుచ్చకాయలు దిగుమతి అవుతున్నాయి. రిటైల్ విక్రయాల్లో కిలో పుచ్చకాయ రూ.18, బహిరంగ, సూపర్ మార్కెట్లలో రూ.25 నుంచి రూ.30 వరకు విక్రయమవుతోంది. మరో కొన్ని రోజుల్లో ఎండ తీవ్రత అధికం కానుండగా, పుచ్చకాయలు దిగుమతులు అధికం కావడంతో పాటు వాటి ధరలు కూడా పెరిగే అవకాశముందని వ్యాపారులు తెలిపారు.

పాంబన్ వంతెన పరిశీలన



పెరంబూర్, ఫిబ్రవరి 20: రామనాథపురం జిల్లాలోని పాంబన్ వంతెనను మంగళవారం రైల్వే బోర్డు సీఈఓ జయవర్మసిన్హా పరిశీలించారు. ఢిల్లీ నుంచి ఉదయం మదురై చేరుకున్న సీఈఓ ప్రత్యేక రైలులో మండపం ప్రాంతానికి వెళ్లారు. అక్కడ పాంబన్ రైల్వే వంతెన నిర్మాణాలను పరిశీలించిన సీఈఓ, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం రామేశ్వరం-ధనుష్కోటి మధ్య న్యూలైన్ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మెకానికల్, ట్రాన్స్‌పోర్టేషన్) అలోక్‌కుమార్ మిశ్రా, దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అమిత్‌కుమార్ మానువాల్, చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ ఎన్.శ్రీకుమార్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ దేశ్‌రతన్ గుప్తా తదితరులున్నారు.

వంతెనను పరిశీలిస్తున్న రైల్వే బోర్డు సీఈఓ జయవర్మ సిన్హా, దక్షిణ రైల్వే జీఎం ఆర్ఎన్ సింగ్ తదితరులు



మంత్రితో పోలీసులు

నగర పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'హార్స్ రైడింగ్ స్కూలు'

● ప్రారంభించిన మంత్రి ఉదయనిధి

పెరంబూర్, ఫిబ్రవరి 20: గ్రేటర్ చెన్నై పోలీసు, క్రీడాభివృద్ధి సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో 'ఫస్ట్ గ్రేటర్ చెన్నై పోలీస్ ఈక్వేస్ట్రియన్ ఛాంపియన్ షిప్ 2024', 'హార్స్ రైడింగ్ స్కూల్' ప్రారంభోత్సవాలు మంగళవారం జరిగాయి. స్థానిక పుదుపేటలో నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి ప్రతనిధిగా యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి హాజరై ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభించారు. 13 విభాగాల్లో జరగనున్న ఈ పోటీల్లో 46 గుర్రాలతో 8 జట్లు పాల్గొంటున్నాయి. మూడు రోజులు జరగనున్న ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్టు రూ.10 వేల నగదు, బంగారు పతకం, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.7 వేలు, రజత పతకం, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేలు, కాంస్య పతకం అందజేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా పుదుపేటలో ఏర్పాటు చేసిన 'హార్స్ రైడింగ్ శిక్షణ పాఠశాల'ను మంత్రి ప్రారంభించారు.

ప్రభుత్వ బస్సులో కలెక్టర్ ప్రయాణం

పెరంబూర్, ఫిబ్రవరి 20: మైలాడుదురై జిల్లా కలెక్టర్ మహాభారతి ప్రభుత్వ బస్సులో ప్రయాణించారు. మంగళవారం ఉదయం తన క్యాంప్ కార్యాలయం నుంచి నడుచుకుంటూ నాంజిల్‌నాడు బస్టాండ్‌కు వెళ్లిన కలెక్టర్, అక్కడి నుంచి బస్సులో ఎక్కి కార్యాలయానికి వెళ్లారు. ప్రజలు సొంత వాహనాలు వినియోగం తగ్గించి, ప్రజా రవాణాను వినియోగించాలని, కాలుష్యరహిత జిల్లాగా మైలాడుదురైను మార్చేందుకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు.



బస్సులో ప్రయాణిస్తున్న కలెక్టర్

విజ్ఞానాన్ని పంచిన 'హిట్స్' సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న ప్రముఖులు

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పడూర్‌లోని హిందుస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హిట్స్)లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న సదస్సు విజ్ఞానాన్ని పంచుతోంది. 'అడ్వాన్సెస్ ఇన్ ఏరోస్పేస్ స్ట్రక్చరల్ డిజైన్ (ఏఏఎస్‌డీ) పేరుతో సోమవారం ప్రారంభమైన ఈ సదస్సు ఈనెల 21వ తేదీ వరకు కొనసాగనుంది. డీఆర్‌డీవో, ఇన్ఫోసిస్, ఎన్ఏఎల్, ఐఐటీ, ఎంఐటీలకు చెందిన శాస్త్రవేత్తలు, విద్యానిపుణులు పాల్గొన్న ఈ సదస్సులో విద్యార్థులు రూపొందించిన ఎయిర్‌క్రాఫ్ట్, స్పేస్ వెహికల్, గ్యాస్ టర్బైన్ వంటి వాటిని ప్రదర్శించారు. యూనివర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ ఆనంద్ జాక్ వర్గీస్ నేతృత్వంలో సాగిన ఈ సదస్సుకు ప్రొ ఛాన్సలర్ అశోక్ వర్గీస్, వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎస్ఎన్ శ్రీధర స్వాగతం పలికారు. నావల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా, నావల్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్.. విమానయానం పట్ల తనకున్న మక్కువను సభికులతో పంచుకున్నారు. హిట్స్ వ్యవస్థాపకుడైన తన తండ్రి డాక్టర్ కేసీజీ వర్గీస్ వారసత్వం గురించి, విమానయాన నిపుణులకు ఇచ్చిన శిక్షణ గురించి ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తమ సంస్థలో విద్యార్థుల కోసం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, సౌకర్యాల అభివృద్ధి గురించి వివరించారు.

డీఎంకే - అన్నాడీఎంకే రహస్య కూటమి

● కె.అన్నామలై ఆరోపణ



అడయార్, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఎదుగులను చూసి ఓర్వలేని రెండు ద్రావిడ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకే రహస్య అవగాహనతో పొత్తుపెట్టుకున్నాయని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. రాష్ట్రంలో రాజకీయాలు ఏ విధంగా ఉండకూడదని భావిస్తున్నామో ఆ కోణంలో ఉన్నాయన్నారు. డీఎంకే, అన్నాడీఎంకేలు రాష్ట్రాభివృద్ధి కంటే తమ వ్యక్తిగత వృద్ధిపైనే దృష్టి సారించాయన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మూడు సార్లు విదేశీ పర్యటనలకు వెళ్ళినప్పటికీ ఒక్క రూపాయి కూడా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.33 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తే, డీఎంకే ప్రభుత్వం కేవలం రూ.6.6 లక్షల కోట్ల పెట్టుబడులను మాత్రమే ఆకర్షించిందని, ఇందులో కూడా ఒక్క రూపాయి కూడా రాష్ట్రానికి రాలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 3.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన డీఎంకే.. ఇటీవల వార్షిక బడ్జెట్‌లో 60 వేల ఉద్యోగాలు మాత్రమే కల్పించామని పేర్కొనిందన్నారు.

నోరూరిస్తున్న 'మద్రాస్ కిచెన్ స్టూడియో'

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేట కేబీ దాసన్ రోడ్డులో ఉన్న 'మద్రాస్ కిచెన్ స్టూడియో' ఆహారప్రియులను నోరూరిస్తోంది. ప్రముఖ చెఫ్ అభిరాం ప్రభాకర్ సొంతంగా ఈ స్టూడియో ప్రారంభించడం విశేషం. దీనిపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'ఫైవ్‌స్టార్ హోటళ్లలో అన్ని వేళలా ఆహారం తినలేమని గ్రహించా. అప్పుడే నా మదిలో ఏదైనా చేయాలనే ఆలోచన మొలకెత్తింది. ఎంతో ప్రత్యేకంగా తయారు చేసే వంటకాలను ఇక్కడ అందుబాటులో వుంచుతున్నాం' అని వివరించారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ స్టూడియో అందుబాటులో ఉంటుంది. ఇద్దరి ఆహారం రూ.700గా ధర నిర్ణయించారు. మరిన్ని వివరాల కోసం నెం.8073252660లో సంప్రదించవచ్చు.



చెఫ్ అభిరామ్ ప్రభాకర్